'ఆటా' పోటీల్లో ఎంపికైన కథ

-డొన్నలగడ్డ రామలక్ష్మి

# సభాపర్వం





కొందరు గొప్పవాళ్ళుగా పుడతారు, కొందరు గొప్పతనాన్ని సాధిస్తారు, కొందరికి గొప్పతనం ఆపాదించబడుతుంది అని షేక్స్‌పియర్ కాబోలు అన్నాడు. అయితే గొప్పతనానికి గీటురాయి ఉండాలి కదా- అది సభల ద్వారా లభించే గుర్తింపు అని నమ్ముతాడు శంకరయ్య.

నేను కలుపుగోరు మనిషిని కాను. మాటలతో కాలానికి జీవం పోయాలి తప్ప చంపకూడదంటాను. అందుకని నన్ను కంపెనీకి బోరనుకునేవారే ఎక్కువ.
కానీ మా పక్కింటి రాఘవ నన్నొక మహాజ్ఞానిగా నమ్మి అభిమానిస్తాడు, ఆరాధిస్తాడు. ఒక్కసారి కూడా నేను తనింటికి వెళ్ళకపోయినా పంతానికిపోక తరచుగా మా ఇంటికొచ్చి అనేక విషయాలపై నా అభిప్రాయాలడుగుతాడు. శంకరయ్య రాఘవ తండ్రి.

పదేళ్ళ క్రితం పదవీ విరమణ చేసిన శంకరయ్యకు తను సాహితీపరుణ్ణని గట్టి నమ్మకం. రాఘవ నా గురించి ఏం చెప్పాడో కానీ ఆయన సాహిత్య చర్చ చేద్దామంటూ ఓసారి నావద్దకొచ్చాడు. నాకు పెద్దలంటే గౌరవం కాబట్టి కాదనలేకపోయాను. ఉపోద్ఘాతంగా ఆయన ప్రముఖ సాహితీపరుల పేర్లు ప్రస్తావిస్తే క్లుప్తంగా ముగిసిందని మురిసాను. అంతలోనే ఆయన తన గురించి మొదలెట్టాడు. చదువుకునే రోజుల్లో ఆయన కవితలు రాస్తే వాటిని ఆడపిల్లలు సినిమా పాటల్లా పాడుకునేవారట.

"మచ్చుకి ఓ కవిత చెబుతారా?" అన్నాను మర్యాదకి.

"కారులో షికారుకెళ్ళే పాలబుగ్గల పసిడీ దానా..." అంటూ ఆయన మొదలెట్టేసరికి నేను ఇబ్బందిపడి, "ఇలాంటిదే ఆత్రేయగారి సినిమా పాటుందేమో"అన్నాను.

ఆయన వెంటనే, "అది ఆత్రేయ గారిదే. ఈ పాట పుట్టినప్పటికి నువ్వు పుట్టి ఉండవు. నీ జ్ఞాపకశక్తి మహా దొడ్డది"అని నన్ను మెచ్చుకుని, "నా కవితకూ అర్థం అదే -కారు బదులు నావ, బుగ్గల బదులు పెదాలు ఉంటాయి. ముందు నా కవిత- తర్వాతే ఆత్రేయ గారిది. సినిమాలో వచ్చింది కాబట్టి అది పాప్యులరైంది. నాది కాలేజీ దాటలేదు. ఇప్పుడు నా కవితకు ఏ గతి పట్టిందంటే ముందు ఆత్రేయ గారిది చెబితేనే దాన్ని అప్రీషియేట్ చేస్తారు. మన దేశంలో డూప్లికేటుకున్న విలువ ఒరిజినల్‌కి లేదు" అని నిట్టూర్చాడు.

షేక్స్‌పియర్ నాటకాలు షేక్స్‌పియరే వ్రాసాడా అన్న మీమాంస ఇప్పటికీ ఉంది. నాకు తెలిసిన ఓ రచయిత- హిట్ సినిమా చూసొచ్చినప్పుడల్లా ఆ కథ ఇంకా ప్రచురితం కాని తన కథకు కాపీ అని నావద్ద వాపోతూంటాడు. శంకరయ్యగారూ ఆ టైపనుకున్నాను. ఇంతకీ ఆరోజున ఆయన నాకు తన కవిత వినిపించే లోగానే ఇంట్లోంచి పిలుపు వచ్చింది. "కారులో షికారుకు ఒరిజినల్ వినాలని నీకు మహా కుతూహలంగా ఉన్నట్లుంది. నీకెప్పుడు వీలో కబురు పెడితే మరోసారి వచ్చి నా కవిత వినిపిస్తాను" అని హామీ ఇచ్చి వెళ్ళిపోయేడాయన.

అలా అన్నాడు కానీ నా కబురు లేకుండానే నాలుగు రోజుల తర్వాత ఆయన మా యింటికొచ్చాడు. అసలు మొన్నే వచ్చేవాట్ట. రాఘవ, "నాన్నా- నువ్వైతే రిటైరై ఖాళీగా ఉన్నావు- ఆయనకు బోలెడు పనులు" అని వెళ్ళనివ్వలేదుట. నాకెన్ని పనులున్నా సాహితీ చర్చల కోసం వాయిదా వేసుకుంటానని నచ్చజెప్పినా వినలేదుట. ఈరోజెలాగో రాఘవ కళ్ళుగప్పి వచ్చాడు.

మర్యాదకోసం లేని ఆసక్తి నటించి ఆ కవిత గురించి అడిగాను.

ఆయన వెంటనే, "ఇక ఆ కవిత ప్రసక్తి వద్దు. దాన్ని తల్చుకుంటేనే నాలోని కవికి జరిగిన అన్యాయం గుర్తుకొచ్చి గుండె బద్దలైపోతుందయ్యా!"అన్నాడు.

ఓదార్చాలని ఆయనకేసి చూస్తే ముఖంలో ఎక్కడా గుండె బద్దలవుతున్న అనుభూతి ఛాయలు లేవు. పైగా ఉత్సాహం అనతగ్గ లక్షణాలు కొట్టొచ్చినట్లు కనపడుతూంటే నాకాశ్చర్యం వేసింది. ఏమనాలా అని ఆలోచిస్తూండగా ఆయనే, "ఉద్యోగంలో చేరగానే కథల్రాయడం మొదలెట్టాను" అన్నాడు.

అంతకుముందు అనుభవాన్నిబట్టి మర్యాదక్కూడా మచ్చు అడక్కూడదనుకున్నాను కానీ ఆయనే, "నీకు 'ఆరు సారా కథలు' తెలుసా?" అన్నాడు.

"తెలియకేం- రావిశాస్త్రిగారి అద్భుత సృష్టిలో భాగమవి" అన్నాను.

"అయితే నీకు తెలియనిదొకటుంది. రావిశాస్త్రి కథలు బాగా రాస్తారు కానీ ఆయనకు పేర్లు పెట్టడం రాదు. అసలు- ఏ కథ గొప్పతనమైనా సగం దానికి పెట్టిన పేరుదే" అన్నాడాయన.

నాకు రావిశాస్త్రి కథలూ, వాటికి పెట్టిన పేర్లూ సమంగానే నచ్చుతాయి. ఐనా కథ గొప్పతనం పేరుమీద ఆధారపడుతుందనుకోను. పెద్దాయనతో వాదనకు దిగాలా అనుకుంటూండగా ఆయనే, "నా మొదటి రచన పేరు 'ఆరు సారా కథలు'. ఆ పేరులో గొప్ప చమత్కారముంది. ఆరు అంటే ఆచంట రుక్మిణి. సారా అంటే సాలూరి రామం. రామం రుక్మిణిని ప్రేమించాడు. ప్రేమ ఫలించేలోగా రుక్మిణి అతణ్ణి అపార్థం చేసుకుంది. రామం భగ్నప్రేమికుడై సారాకొట్టుకి వెడతాడు. అక్కడ అతణ్ణి చూసి జాలిపడిన ఓ పెద్దమనిషి అతడికీ రుక్మిణికీ రాజీ చేస్తాడు. ఐనా మళ్ళీ వారిద్దరిమధ్యా అపార్థమొస్తుంది. రామం మళ్ళీ సారాకొట్టుకి వెడతాడు. మళ్ళీ ఎవరో ఆ ప్రేమికులకు రాజీ కుదురుస్తారు. అలా ఆరు సార్లు జరుగుతుంది. ఆ తర్వాత వారికి రాజీ కుదిరినా

రామం సారా కొట్టుకి వెడతాడు. అతడికి సారా అలవాటుగా మారిందని గ్రహించిన రుక్మిణి వేరే పెళ్ళి చేసుకుంటుంది. రామం తాగుబోతైపోతాడు. ఇదీ నా తొలి రచన ఇతి వృత్తం''అన్నాడు.

''చాలా బాగుంది''అన్నాను మనస్ఫూర్తిగా. అబద్ధమెందుకూ ఆ కథ వినగానే నాకాయన రచనాశక్తిమీద అంతవరకూ లేని గౌరవం పుట్టింది.

''అప్పుడందరూ అదే అన్నారు. నా కథ పేరే నా మిత్ర వర్గంలో పెద్ద సంచలనం రేపింది. ఆ పేరులో పాత్రల పేర్లు, ఆరు అంకె, సారా ఇమిడాయి. ఇతివృత్తంలో ప్రేమికులు, తాగుబోతులకు వ్యంగ్యాత్మక సందేశాలున్నాయి'' చెబుతూంటే ఆయన కళ్ళు మెరుస్తున్నాయి.

''మీ కథ ఏ పత్రికలో వచ్చింది?'' అనడిగాను కుతూహలంగా.

''అదంతా ఓ విషాద గాథ'' అని నిట్టూర్చేడాయన.

'ఆరు సారా కథలు' పేరు రావిశాస్త్రి దాకా వెళ్ళింది. ఆయన స్వయంగా శంకరయ్యను కలుసుకుని, ''ఓ నా థీమ్‌కు మంచి పేరు దొరక్క ఇన్నాళ్ళూ ఆగాను. దానికి 'ఆరు సారా కథలు' అన్న పేరు పెట్టుకుందుకు మీ అనుమతి కావాలి''అన్నాడు. అంత పెద్దమనిషి నోరు విడిచి అడిగేసరికి శంకరయ్య కాదనలేకపోయాడు. రావిశాస్త్రి ఆయన ఔదార్యాన్ని మెచ్చుకుని, ''కథకు ఇతివృత్తం కంటే పేరు ముఖ్యం. నా కథలకు ముందుమాటలో మీ సహకారాన్ని ప్రస్తావిస్తాను''అన్నాడు. శంకరయ్య ఒప్పుకోక, ''ఒకే పేరుతో రెండు రచనలుండకూడదని లేదు. మీ కథను మీరు వ్రాయండి. నా కథను నేను వ్రాస్తాను. నా కథ ముందుగా వస్తే ఆ పేరు నాదేనని జనాలకెలాగూ తెలుస్తుంది'' అన్నాడు. కానీ శంకరయ్యకు ఆటలమ్మ సోకడంతో కథ వ్రాయడం ఆలస్యమైంది. ఈలోగా రావిశాస్త్రి కథ వ్రాసి, ప్రచురించి పేరు తెచ్చేసుకోవడం జరిగింది. నిరుత్సాహపడ్డ శంకరయ్య మళ్ళీ కథల జోలికి వెళ్ళలేదు.

''పాపం రావిశాస్త్రి నాకు క్రెడిట్ ఇస్తాననే అన్నారు. ఒప్పుకుంటే సరిపోయేది. అయినా- గుర్తింపుకూ యోగముండాలి''అంటూ నిట్టూర్చాడాయన.

నాకా కథ చదవాలనిపించింది. అడిగితే ఎక్కడో పెట్టి మర్చిపోయాననీ వెతకాలనీ అన్నాడాయన. వెతకమని మరీ మరీ చెబితే ఆ కాగితాలు దొరకడం కష్టమన్నాడు. దొరికినా కథను తిరగరాయడం తనవల్ల కాదన్నాడు. తన వాళ్ళెవరికీ కథలు తిరగరాసే ఆసక్తి లేదన్నాడు.

''మీ కథను వెతికి తీసుకుని రండి. దాన్ని నేను తిరగ రాస్తాను'' అన్నాను.

ఊహించని నా ఆఫర్‌కి తెల్లబోయాడేమో ఆయన నాకు కృతజ్ఞతలు చెప్పి ఆ కథను వెతికి తెస్తానని వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రెండురోజులకు రాఘవ మా యింటికొచ్చి, ''మీతో మా నాన్న గురించి చెప్పాలి'' అన్నాడు. నేను సరేననగానే మొదలుపెట్టాడతడు.

శంకరయ్య రెవిన్యూ డిపార్ట్‌మెంట్లో ఉన్నత పదవి నిర్వహించి రిటైరయ్యాడు. నిజాయితీపరుడిగా పేరుతెచ్చుకున్నాడు. హోదా పెద్దది కావడంవల్ల ఆయనకున్న ఆశ్రితుల సంఖ్య కూడా పెద్దదే. ఆఫీసులో అంతా ఆయనకు అడుగులకు మడుగులొత్తేవారు. బయట కూడా ఏ పార్టీలకు వెళ్ళినా ఆయనకు ప్రత్యేక మర్యాదలు జరిగేవి. అందరూ ఆకాశానికెత్తేస్తూంటే ఆ గొప్పతనం తన హోదాదని గ్రహించక వ్యక్తిత్వానిదనుకున్నాడాయన. ఎన్నో సభలకు అధ్యక్ష స్థానాన్నలంకరించి అందుక్కారణం తన ప్రతిభకు గుర్తింపని భ్రమపడ్డాడు. ఇప్పుడు రిటైరయ్యేక ఇంటాబయటా తననెవరూ పట్టించుకోనందుకు వాపోతున్నాడాయన.

''రిటైరై ఖాళీగా ఉన్నాడు. ఇంటి మొత్తానికి తనొక్కడికే బొత్తిగా ఏ పనీ లేదు. అందరూ వారివారి పనులు మానుకుని రోజంతా తనతో కాలక్షేపం చేయాలంటాడు. అలాగని వాళ్ళ పనులు తను చేస్తాడా అంటే అదీ లేదు. ఇంటికి సంబంధించి ఏ పని చేయాలన్నా ఆయనకు నామోషీ. పోనీ అని ఇంట్లో వాళ్ళం వంతులవారీగా ఎంగేజ్ చేద్దామనుకున్నా ఆయనకు కావాల్సింది అయినవాళ్ళ అనురాగం, అభిమానం, ఆత్మీయత కాదు. అగ్రస్థానం. ఆయన్ను బాస్‌గా భరించలేక



సూర్యం ఆ విధంగా నా ఋణం తీర్చుకోవాలనుకుంటున్నాడు. కానీ సభతో ముడిపడినందువల్ల అది నాకు చాలా పెద్ద శిక్ష అని చెప్పలేక అట్నించి నరుక్కొద్దామని, ''టీవీ చూస్తూ టెండూల్కర్ ఎలా ఆడాలో చెప్పేనని క్రికెట్ ఆటగాణ్ణైపోను. మీరు పుస్తకం ఆవిష్కరణకు సాహితీ పరుల్నో, రచయితల్నో కలవండి'' అంటూ నేనతడికి కొన్ని పేర్లు కూడా సూచించాను.

అంతా ఆయనకు దూరంగా ఉంటున్నారు. ఇంట్లో అగ్రస్థానం లేదని ఆ దిగులుతో ఆయన మాలో ఎవ్వరితోనూ కలిసిమెలిసి మసలలేకపోతున్నాడు''అన్నాడు రాఘవ.

''పులికి మనిషి రక్తం లాంటిది మనిషికి అధికారం'' అని నిట్టూర్చాను.

''ఇంట లేని అగ్రస్థానం కోసం ఆయనిప్పుడు రచ్చకెక్కుతున్నాడు. స్పోర్ట్స్‌లో ఆసక్తిఉన్న వారితో తను రామనాథన్ క్రిష్ణన్‌కి టెన్నిస్‌లో మెలకువలు నేర్పానంటాడు. సంగీతం పట్ల ఆసక్తి ఉన్న వారితో తనకూ బాలమురళికీ లేని అనుబంధం కల్పించి చెబుతాడు. మీకు సాహిత్యమంటే ఆసక్తి అని తెలిసి తనూ కథలు రాస్తానని చెబితే మీరేమో అది నమ్మి ఆయన కథలు ఫెయిర్ చేస్తానన్నారుట. ఇప్పుడు కథలెక్కణ్ణించి తేనూ అని బెంగెట్టుకున్నాడు.''

నాకు విషయం అర్థమై, ''అయాం సారీ- మరి మనమిప్పుడేం చేయాలి?''అన్నాను.

''ఊళ్ళో ఏవో సభలౌతూనే ఉంటాయి. వాటిలో దేనికైనా అధ్యక్ష స్థానం లభిస్తే కొన్నాళ్ళైనా ఆయన దృష్టి వేరే మళ్ళుతుందేమో'' అన్నాడు రాఘవ.

సభలంటే నాకేమాత్రమూ సదభిప్రాయం లేదు. చిన్నప్పట్నించి వెడుతున్నాను సభలకు. అక్కడ మనసేమాత్రమూ ఎరుగనివారు మనకు సన్మానం చేస్తారు. ఆగర్భశత్రువులు ఆజన్మమిత్రులుగా నటిస్తారు. మనను చిరస్మరణీయులన్న వారికి సభ ముగిసిన మరుక్షణం మనం అపరిచితులమైపోతాం. సభల సంప్రదాయం కూడా సదుద్దేశ్యంతోనే ప్రారంభించబడి ఉండవచ్చు. కానీ సదుద్దేశ్యంతో ప్రారంభించిన గాంధీజీ సత్యాగ్రహంలా, భారతీయుల ప్రజాస్వామ్యంలా- ఆచరణకు వచ్చేసరికి సభలూ వెర్రితలలు వేసాయనిపిస్తుంది నాకు. అందువల్లనే నేను సభలు నిర్వహించను. వాటిలో యాక్టివ్ రోల్ తీసుకోను. శ్రోతగా, ప్రేక్షకుడిగా ఉండడానికి మాత్రం అభ్యంతరముండదు నాకు.

రాఘవ నా అభిప్రాయంతో ఏకీభవించినట్లే కనపడినా అతడి ముఖం చూస్తే ఏదో చెప్పాలనుకుంటున్నట్లు తోచింది. అదేమిటనేలోగా మా యింటికి సూర్యం వచ్చాడు.

సూర్యం రచయిత. అతడు వ్రాసిన కథలు అరవైదాకా ప్రచురితం. అతడూ రాఘవలాగే నన్ను మహాజ్ఞానిగా నమ్మి తన కథల విషయమై సలహాలడుగుతూంటాడు. నా సలహాలు పాటించేక తిరిగొచ్చిన తన కథలు కొన్ని ప్రచురణకు నోచుకోవడంతో అతడికి నా మీద గురి పెరిగింది. నాకు తెలిసిన ఓ పబ్లిషర్ని కలవమని చెబితే ఆయన అతడి కథాసంకలనాన్ని ప్రచురించడానికి ఒప్పుకున్నాడు. దాంతో అతడికి నేనంటే కాస్త భక్తిభావమూ ఏర్పడింది.

''నా పుస్తకం ఆవిష్కరణ సభకి మీరే అధ్యక్షత వహించాలి'' అన్నాడు సూర్యం.

సూర్యం ఆ విధంగా నా ఋణం తీర్చుకోవాలనుకుంటున్నాడు. కానీ సభతో ముడిపడినందువల్ల అది నాకు చాలా పెద్ద శిక్ష అని చెప్పలేక అట్నించి నరుక్కొద్దామని, ''టీవీ చూస్తూ టెండూల్కర్ ఎలా ఆడాలో చెప్పేసని క్రికెట్ ఆటగాణ్ణైపోను. మీరు పుస్తకం ఆవిష్కరణకు సాహితీ పరుల్నో, రచయితల్నో కలవండి'' అంటూ నేనతడికి కొన్ని పేర్లు కూడా సూచించాను.

''మీరిలాగంటారని నాకు ముందే తెలుసు. అందుకే- మీకంటే అర్హులు లేరని నమ్మి కూడా- మీరు చెప్పిన వారందర్నీ కలిసాకే మీ దగ్గరకు వచ్చాను. నా అదృష్టం కొద్దీ ఒక్కరికీ తీరుబడి లేదు'' అన్నాడు సూర్యం లౌక్యంగా.

నేనెంత చెప్పినా అతడు తన పట్టువిడవకుంటే, ''మీరు మరీ ఇంతలా మొహమాటపెడితే నేనసలు మీ సభకే రాలేకపోవచ్చు'' అన్నాను మొండితనానికి మర్యాదను జత పర్చుతూ.


''నా సభకు అధ్యక్షతైనా వహించండి. లేదా తగిన అధ్యక్షుణ్ణి సూచించండి. అంతవరకూ నేనిక్కణ్ణించి కదలను'' అన్నాడు సూర్యం మర్యాదకు మొండితనాన్ని జతపర్చుతూ.

ఉన్నట్లుండి రాఘవ నన్ను గిల్లాడు- తన తండ్రిని గుర్తుచేస్తూ. అది ముందే తట్టనందుకు నాలిక్కరుచుకుని వెంటనే సూర్యంకు శంకరయ్య పేరు చెప్పాను. రెవిన్యూ డిపార్ట్‌మెంట్లో ఆయన నిర్వహించిన పదవి గురించి తెలియగానే, ''మరాయనకు ఖాళీ ఉంటుందా?'' అని కంగారు కూడా పడ్డాడు సూర్యం.

ముగ్గురం రాఘవ ఇంటికెళ్ళి శంకరయ్యను కలిసి విషయం చెప్పాం. ఒప్పుకుంటాడా అని సూర్యం బెంగపడితే అతడెప్పుడెళ్ళిపోతాడా ఎగిరి గంతేద్దామని శంకరయ్య ఎదురుచూసాడు. ఏమైతేనేం శంకరయ్యకు సభాధ్యక్ష పదవి లభించింది!

*(మిగతా 12వ పేజీలో)*

# బంగారం.. బండారం!



అనాది కాలంగా మానవులు బంగారం కోసం ప్రపంచం నలుమూలలా అన్వేషణ సాగిస్తూనే ఉన్నారు. అందుకోసం ఎన్నెన్నో వ్యయ ప్రయాసలకు గురవుతూనే ఉన్నా, వారికి సువర్ణం పట్ల గల మోజు, అంతులేని ఆశ వలన ఎప్పటికప్పుడు పట్టుదల పెరిగి, ఆ ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

క్రీస్తుకు పూర్వం **424-485** మధ్య కాలంలో హెరొడోటస్ అనే చరిత్రకారుడు బంగారం చరిత్రను, దానిని పొందడం కోసం అనేకమంది ధైర్యవంతులు చేసిన సాహసాలు గురించి కొన్ని కథలు చెప్పేవాడు. ప్రాచీన కాలంలో భారతీయులు అందరికన్నా హెచ్చుగా సువర్ణాన్ని సేకరించారనీ, వారివద్ద అంతులేని ఆ విలువైన లోహం ఉందని హెరొడోటస్ అన్నాడు.

ఆయన యదార్థంగా జరిగిన కొన్ని సంగతులను కూడా ఆయన కథనాల్లో పేర్కొన్నాడు కూడా. అతి పెద్దదైన ఎడారిలో ఒక వ్యక్తి ఒంటె మీద నుంచి దిగాడు. అతనితో ఇంకా 3 ఒంటెలు ఉన్నవి. ఒకటి ఆడ ఒంటె, రెండు మొగ ఒంటెలు. ఆడ ఒంటె ఆమధ్యనే ప్రసవించింది. ఆ వ్యక్తికి బంగారం పట్ల ఎంతో ఆసక్తి, అంతకుమించిన ఆశ ఉంది. అందువలన ఒక యాత్రికుడు చెప్పగా విని, బంగారం దొరికే ఒక ప్రదేశానికి ఒంటెలతో బయల్దేరాడు. చివరికి అతను చేరవలసిన చోటు వచ్చింది. అది అతి పెద్ద చీమలు ఉండే ప్రదేశం. ఆ చీమలు ఎంత పెద్దవంటే, ఇంచుమించుగా ఒక నక్క సైజులో ఉంటాయి. అవి నేలలో అతి లోతైన రంధ్రాలు తవ్వుకొని వాటిల్లో నివశిస్తూ ఉంటాయి. తాము తవ్విన రంధ్రాలవలన వచ్చిన ఇసుకను పైకి విరజిమ్ముతాయి. ఆ ఇసుకలో బంగారం ఇమిడి ఉంటుంది.

అచ్చటకు వెళ్లిన వ్యక్తి ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా తన దగ్గరున్న సంచిలో ఆ ఇసుక పోసుకొనడం ప్రారంభించాడు. అయితే కొంతసేపటిలోనే, బొరియల్లో వున్న పెద్ద చీమలు, అతని అలికిడి గ్రహించాయి. వెంటనే ఒక్కొక్క చీమ కలుగుల్లోంచి బయటకు రావడం ఆరంభించాయి. అది చూసిన వ్యక్తి భయపడి తన మూడు ఒంటెలతోనూ వేగంగా వెళ్లసాగాడు- చేతిలో భద్రంగా సంచి పట్టుకొని.

చీమలు ఆగ్రహంతో ఒంటెలను తరమసాగాయి. మొగ ఒంటెలకన్నా ఆడ ఒంటె తనపై కూర్చుని వున్న యజమానితో వేగంగా, ఆ చీమల బారి పడకుండా పరుగుతియ్యసాగింది. చీమలు పట్టుదలతో ఒంటెలను తరిమాయి. చివరికి వాటి బారిన పడకుండా ఆ వ్యక్తి తప్పించుకొని సంచిలోని బంగారం వలన శ్రీమంతుడయ్యాడు. ఈ దృశ్యం 'బి'గ్రేడ్ సినిమాలోని హారర్ దృశ్యం వలే అనిపిస్తుంది. అయితే అప్పట్లో అనేకమంది ఈ విధంగానే బంగారం సేకరించారని హెరొడోటస్ తను వ్రాసిన ఒక గ్రంథంలో పేర్కొన్నాడు.

అలగ్జాండర్ చక్రవర్తి మన దేశంలో తన సైన్యాలతో వెళ్తూ ఉండగా, బంగారం గురించీ, అతి పెద్ద చీమలు గురించీ విన్నాడు. ఫ్రెంచి సైంటిస్ట్, రచయిత మైకేల్ పీసెల్ అటువంటి పెద్ద చీమలు ఉన్నాయని వ్రాసాడు.

"నిజానికి అవి పెద్ద చీమలు కాదు. ఉడతలు సైజులో ఉండే అవి బొరియల్లో నివశిస్తాయి. తమ నివాసాలకొరకు తవ్విన ఇసుకలో ఇమిడి వున్న బంగారంకోసం వచ్చే మనుషులపైకి అవి లంఘిస్తాయి!"అన్నాడు మైకేల్.

కాశ్మీర్ ప్రాంతంలో నివశించిన 'మినారో' అనే జాతి ప్రజలు సహితం అతి పెద్ద ఉడతలు తవ్విన ఇసుకలో సువర్ణం సేకరించేవారని కూడా మైకేల్ వ్రాశాడు. పర్షియన్ ప్రభువులు అనేక పెద్ద చీమలు పెంచే వారనీ, వాటిని వేటగాళ్లు రాజులకు బహుకరించారని హెరొడోటస్ వ్రాశాడు. ఈ పెద్ద చీమలను 'మర్మోట్' అని పిలుస్తారు. పర్షియా భాషలో ఈ పదానికి అర్థం 'కొండ చీమలు' అని. అనాది కాలంలో అనేకమంది సాహసంతో ఆ కొండ చీమల బారిన పడకుండా, బంగారాన్ని తీసుకువెళ్లేవారు. ఇప్పటికీ ఆ భారీ చీమలు ఉన్నాయనీ, వాటివలన సువర్ణం లభిస్తుందన్న వదంతులూ లేకపోలేదు. అయితే -చూసిన వాళ్లు, అక్కడకు వెళ్లిన వాళ్లే లేరు. **-కొడిమెల**

*(9వ పేజీ తరువాయి)*

నేనింటికి తిరిగొచ్చేక శ్రీమతి నాతో, "ఏమిటి మీరుచేసిన పని? మీ మూలంగా నేను మిమ్మల్ని వేదిక మీద సభాధ్యక్షుడిగా చూసే అవకాశం మిస్ కొట్టాను" అంది.

"అది మిస్ కొట్టకపోతే చాలా గొప్ప జోక్ మిస్ కొట్టేదానివి. జస్ట్ వెయిట్" అన్నాను.

మర్నాడే శంకరయ్య మా యింటికొచ్చాడు. ఆయన చేతిలో ఓ పెద్ద కాగితాల కట్ట ఉంది. అది ఆయన అధ్యక్షోపన్యాసం. చదువుతూంటే ఓపిగ్గా విని బాగుందని మెచ్చుకున్నాను.

"మెచ్చుకుంటే మురిసిపోయే టైపుకాదు నేను. మెచ్చుకున్నావంటే సరిగ్గా వినలేదని అర్థం. ఎందుకంటే శ్రద్ధగా వింటే భగవద్గీతలో కూడా సందేహాలొస్తాయి. మరోసారి చదువుతాను. విని సందేహాలు అడుగు. నువ్వు సందేహాలడిగేదాకా నేను నీకు మళ్ళీ మళ్ళీ చదివి వినిపిస్తూనే ఉంటాను. ఇది మరోటీ మరోటీ కాదు అధ్యక్షోపన్యాసం" అన్నాడాయన.

శ్రద్ధగా విన్నాక నాకా ఉపన్యాసం నిండా బోలెడు లోపాలు కనిపించాయి. నేను చెప్పగానే కొన్నింటినాయన సవరించి నా సహకారానికి మెచ్చుకున్నాడు. కొన్నింటిని సమర్థించుకుని నా అజ్ఞానానికి జాలిపడ్డాడు.

అది ఒకరోజుతో ఆగలేదు. ఆయన ఉపన్యాసం రోజు రోజుకీ మారేది. ప్రతి మార్పునూ గమనించి వ్యాఖ్యానించాల్సిన అగత్యం నాకు పట్టింది. నా అవస్థ చూసిన శ్రీమతి, "ఇదేనా మీరన్న జోక్?" అనడిగింది. నేను "వెయిటండ్ సీ"అన్నాను.

ఆ తర్వాత శంకరయ్య నాకు పెద్ద సైజువి నాలుగు పుస్తకాలు తెచ్చిచ్చి, "వీటిలోంచీ మంచి విషయాలు ఏరి నా ఉపన్యాసం తయారుచేసాను. వీటిని నువ్వూ చదివి నేను చెప్పినవికాక ఇంకేమైనా మంచి విషయాలుంటే చెప్పాలి. లేవన్నావంటే నువ్వు శ్రద్ధగా చదవలేదని అర్థం" అన్నాడు.

చచ్చినట్లు నేనా పుస్తకాలు శ్రద్ధగా చదివి కొన్ని అదనపు విషయాలాయనకు చెప్పాను. కొన్నింటినాయన స్వీకరించి నా సహకారానికి మెచ్చుకున్నాడు. కొన్నింటి నెందుకు స్వీకరించలేదో వివరించి నా అజ్ఞానానికి జాలి పడ్డాడు.

శ్రీమతి, "ఇదా మీరన్న జోక్?" అనడిగింది. నేను మళ్ళీ "వెయిటండ్ సీ" అంటే ఆమె నిట్టూర్చి, "మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది. మీరు సభకు అధ్యక్షుడిగా ఉన్నా ఇంత శ్రముండేది కాదేమో"అంది.

"మన దేశంలో సభలంటేనే బూటకం. వాటి నిర్వహణలో భాగస్వామిని కావడంకంటే ఈ శ్రమే నాకిష్టం" అన్నాను.

"మరి ఆ బూటకపు సభల గురించి శంకరయ్యగారింత హడావుడి చేస్తున్నాడేమిటి?" అంటూ శ్రీమతి ఆశ్చర్యం ప్రకటిస్తే- "ఆయనకు వేరే పని లేదు మరి" అన్నాను.

సభ జరిగేరోజు దాకా శంకరయ్య నన్ను వేధిస్తూనే ఉన్నాడు. ఉపన్యాసం గురించేకాక వేసుకునే డ్రస్సు, కాలి చెప్పులు, తల కట్టు, మీసకట్టు వగైరాలన్నీ నాతో చర్చించేవాడు. ఈ సభ ఇచ్చే గుర్తింపుతో మరిన్ని సభాధ్యక్ష అవకాశాలొస్తాయని ఆయన ఆశ. ఆయన బాధ పడలేక పుస్తకావిష్కరణకోసం సూర్యంకంటే ఎక్కువగా నేనూ ఎదురు చూస్తూ, "ఇదా మీరన్న జోక్?" అని శ్రీమతి అడిగినప్పుడల్లా "వెయిటండ్ సీ" అంటున్నాను.

ఎట్టకేలకు ఆరోజు రానే వచ్చింది. సభలో నేను, శ్రీమతి కాస్త ముందు వరుసలోనే కూర్చున్నాం. వేదిక మీద కూర్చున్న వారిలో సూర్యంకంటే ఎక్కువగా వెలిగిపోతున్న శంకరయ్య ముఖాన్ని శ్రీమతికి చూపించాను. ఆమె నెమ్మదిగా, "ఇదా మీరన్న జోక్?" అంటే నేనూ నెమ్మదిగానే "వెయిటండ్ సీ" అన్నాను.

సభను నిర్వహించే సూత్రధారుడు వేదికనలంకరించిన ప్రముఖులను సభకు పరిచయం చేస్తూ శంకరయ్య గురించి, "ఎన్నో వ్యవహారాల్లో ఊపిరి సలపనంతగా మునిగి తేలుతూ ఉన్నప్పటికీ- కొన్నింటిని వదులుకుని, మరికొన్నింటిని వాయిదావేసుకుని- కొండంత అభిమానంతో మా ఆహ్వానాన్ని మన్నించి వచ్చిన శ్రీయుతులు శంకరయ్యగారీ సభకు అధ్యక్షత వహించడం మన అదృష్టం..." అన్నాడు.

శ్రీమతి "ఇదా మీరన్న జోక్?" అంటుందేమోనని పక్కకు చూస్తే ఆమె పెదాలకు చున్నీ అడ్డం పెట్టుకుని వస్తున్న నవ్వుని ఆపుకుందుకు ప్రయత్నిస్తోంది. నేనూ ఫక్కున నవ్వబోయి తమాయించుకున్నాను. ఎందుకంటే సూర్యంను అభినందించబోయే ఆ సభాపర్వంలో ఈ తరహా జోక్కుకిది అంతం కాదు ఆరంభమన్నది నాకు స్వానుభవం.

★